# తగిన చికిత్స

వింధ్యవాసిని

హాలు కుర్చీలో జారగిలబడి. ఎదురుగా టీపాయ్‌మీదకి కాళ్ళు చాచుకుని కూర్చుని పేపరు చూస్తున్నాడు రామనాథం. రోజూ సాయంత్రం ఆఫీసునుంచి రాగానే కాఫీ తాగి, స్నానం చేసి ఒక గంట సేపయినా అట్లా కూచో వటం అతనికి ఇష్టమయిన పనుల్లో ఒకటి.

లోపల హాల్లో రుక్మిణి పక్క ఇంటి పాపను కూచోబెట్టుకుని కబుర్లాడుతున్నది. వీధిలో ఉన్న ఇరుగు పొరుగు ఇళ్ళ పిల్లలందరికీ ఆమంటే ఎంతో స్నేహం. తనకు పిల్లలులేని లోటు ఆ విధంగా తీర్చుకుంటుంది రుక్మిణి.

గుమ్మం ముందర ఆటో ఆగిన చప్పుడు అయితే ఒక్కసారిగా తల ఎత్తి చూశాడు రామనాథం. చెల్లె లు చిత్ర పిల్లాణ్ణి ఎత్తుకుని, మరో చేత్తో ప్లాస్టిక్ బాస్కెట్ ఒకటి పట్టుకుని వస్తూ కనిపించింది. వారాని కొకసారి, రెండు సార్లు చిత్ర భర్తతో రావటమో, లేక ఆమె ఇంటికి పోవటమో చేస్తునే ఉంటారు. అయినా, చెల్లెలు ఎప్పుడు కనిపించి నా, ఎన్నో రోజుల తర్వాత చూస్తున్నంత సంతో షంగా ఉంటుంది రామనాథానికి.

కానీ, ఈ రోజుమాత్రం కనుచూపు పడేవేళ ఒక్కతే వస్తున్న చిత్రను, బాగ పట్టిపట్టి చూస్తు న్న ఆమె ముఖాన్ని చూస్తె తమాషాంగా



ఉంది రామనాథానికి. ఎదురు వెళ్ళి అల్లుణ్ణి చేతుల్లోకి అందుకుంటూ భార్యను కేకేశాడు. రుక్మిణిని చూడగానే, పిల్లాడు చిరునవ్వులు చిందిస్తూ ఆమె దగ్గరికి దూకాడు.

చెల్లెలి ముఖం చూస్తే విషయం ఏమిటని అడిగి ఆమెను మరింత బాధపెట్టటానికి రామనాథానికి మనసు రాలేదు. నిజానికి కారణం ఏమయి ఉంటుందోకూడ అతను ఊహించగలడు.

వదిన ఇచ్చిన గ్లాసుడు చిక్కని కాఫీ తాగి, కొంచెం కుదుటపడింది చిత్ర.

"ఏమ్మా! రమణ ఏమయినా అన్నాడా?"

"అనటం ఒక్కటేనా...దెబ్బలుకూడా..." తల ఒంచుకుని చెప్పింది.

రామనాథం మరిక మాట్లాడలేకపోయాడు.

"ఆఫీసు పేప రేదో ఇంటికి తెచ్చి దాచారట. మళ్ళీ కావలసినప్పుడు దొరకలేదని నా మీద కోపం. నా కేమీ తెలీదు. నేను చూడ లే దన్నయ్యా! ఇప్పుడే కాదు; మొదటినుంచీ ఇంతే... అతి చిన్న విషయాలకీ కోపం వచ్చేస్తుంది..."

"ఏదీ... ఎక్కడ? దెబ్బేమయినా తగిలిందా?" అనునయంగా అడిగాడు రామనాథం. అతనికి చాలా కోపంగా ఉంది.

"ఉహు అంత పెద్దవేం కాదులే, అన్నయ్యా! మనసుకు తగిలిన దెబ్బే గాయమయి మండుతోంది...అసలు నీకు చెప్పద్దనే అనుకున్నాను కానీ, తప్పలేదు."

"నువ్వు చెప్పకున్నా మాకు తెలును అతని కోపిష్టితనం. కోపంలో వివేకం కోల్పోయి పశువులా ప్రవర్తించటం, ఆ తర్వాత కొంచం సేపటికే పశ్చాత్తాపం, మళ్ళీ బ్రతిమాలుకోటం, నువ్వు కరిగిపోవటం అన్నీ తెలుసు. అందుకే ఈ రోజిలా కోపంలో ఇక్కడికి వచ్చేవంటే ఆశ్చర్యంగా ఉంది నాకు."

"ఆయన కోపంతో, పిచ్చి ఆవేశంతో విసిగిపోయాను. భరించినన్నాళ్ళు భరించటం అయింది. బాబు పెద్దవాడవుతున్నాడా? ఈయన ప్రవర్తన మారకపోతే ఎంత అసహ్యంగా ఉంటుందో నువ్వే చెప్పన్నయ్యా?"

"నేను మాట్లాడనా రమణతో..." నిజానికి ఇల్లాటి మాట్లాడటాల వల్ల, మూడో మనిషి కల్పించుకోవటంవల్ల పెద్దగా ప్రయోజనం ఉండబోదని రామనాథానికి తెలుసు. కానీ, చెల్లెలి బాధ చూసి సహించలేక అన్నాడు.

"లాభంలే దన్నయ్యా! ఆయన తనది తప్పని ఒప్పేసుకుంటారు. కావాలంటే మరోసారిలా చెయ్యనని నీకు ప్రమాణం కూడా చేస్తారు."

"... ... ..."

"అందుకని నేనే ఆయన్ను శిక్షిద్దా మనుకున్నాను. ఇలా వచ్చేశానా... మళ్ళీ మూడు రోజులదాకా తిరిగి వెళ్ళను. ఇప్పటినుంచీ ఆయన ఎప్పుడు గొడవ పెట్టినా, ఇలాగే వచ్చేస్తాను. అప్పటికయినా..."

బయట మోటార్ సైకిల్ ఆగిన చప్పుడయింది.

"అన్నయ్యా! ఆయనే వచ్చింది. అప్పుడే వచ్చేశారు చూడు. మాట్లాడానంటే లాభం లేదు. ఇంటికి తీసుకెళ్ళి పోతారు. నేను కనిపించను. నువ్వే మాట్లాడు" అని లోపలికి పోయింది చిత్ర.

రమణ లోపలి కొచ్చేసరికి రామనాథం ఏమీ జరగనట్లు పేపరు చూస్తూ కూచుని ఉన్నాడు. అతని వాలుకుర్చీ లోపలికి దారి తీసే ద్వారానికి అడ్డంగా ఉంది.

"చిత్ర వచ్చిందా, బావగారూ?" ఆదుర్దాగా అడిగాడు రమణ.

"ఊ!" పేపరు తొలగించకుండానే జవాబిచ్చాడు రామనాథం.

"వెంట బాబున్నాడా?"

"ఇద్దరూ కలిసే వచ్చారు... కాసేపయింది వచ్చి."

తరవాత ఇంకేం అడగాలో అర్థం కాలేదు రమణకు.

చిత్ర వెళ్ళిపోయాక తాపీగా వెతుక్కుంటే కనిపించకుండా పోయిన ఆఫీసు పేపరు దొరికింది. గాలి తీసేసిన బెలూన్‌లా అయిపోయాడు రమణ. కోపం, ఆవేశం అంతా క్షణంలో ఆవిరయిపోయాయి. వెంటనే భార్యను వెతుకుతూ బయలు దేరాడు.

"కూచో, రమణా!" అన్నాడు రామనాథం.

భయపడి, వేగంగా వచ్చాడేమో చమటలు కక్కుతున్నాడు రమణ. ఫాన్ స్విచ్ నొక్కి కుర్చీలో కూర్చున్నాడు. రుక్మిణి టీ తీసు కొచ్చింది.

"బాబు ఏం చేస్తున్నా డక్కయ్యా?" అని అడిగాడు రమణ.

రుక్మిణి మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపో

RADEUS/SB/5-83






యింది.

"సిగ్గు విడిచి అడిగాడు చివరికి—"పెద్ద పొరపాటయి పోయింది. బావగారూ! చిత్రని పిలవరూ. మాట్లాడాలి" అని.

"తనకు నీతో మాట్లాడటం ఇష్టం లేదటోయ్! రెండు రోజు లుండి వచ్చేస్తుందిలే."

"రెండు రోజు లనేముంది—తనకు నీతో ఉండాలనిపిస్తే వారం రోజు లుండనివ్వండి. కానీ. అయిదు నిమిషాలు మాట్లాడి వెళతాను... పిలవండి."

"సారీ. రమణా! తను నీ ముఖం చూడలేనని చెప్పింది." ఇంక మాట్లాడాల్సిందేమీ లేదని మళ్ళీ పేపర్లో తల దూర్చేశాడు రామనాథం.

మాట్లాడకుండా ముఖం వేలాడేసుకుని వెళ్ళిపోయాడు రమణ. చెల్లెలి మీద చెయ్యి చేసుకున్నాడని ముక్కు దాకా కోపంతో మండుతున్న రామనాథానికే, అతని ముఖం చూస్తే జాలేసింది. ఈ పరిస్థితిలో చిత్ర ఎదురుగా వస్తే. కరిగిపోయి అతని వెంట వెళ్ళిపోతుందంటే ఆశ్చర్యం లేదు అనుకున్నాడు అతను.

** ** **

నెల రోజుల తరవాత ఒక ఆదివారం పొద్దున్నే ఇంటి ముందర మోటార్ సైకిల్ శబ్దం వినిపిస్తే. షేవింగ్ చేసుకుంటున్న రామనాథం అలాగే బయటికి వచ్చాడు.

చిత్ర చిన్న సూట్‌కేసు పట్టుకుని వస్తుంటే. వెనకాలే రమణ బాబు నెత్తుకుని వస్తున్నాడు. రామనాథం కంగారుగా వాళ్ళిద్దరి ముఖాల్లోకి చూశాడు. చిరు నవ్వులే కనిపించాయి. 'అమ్మయ్య' అనుకున్నాడు.

"అర్జంటుగా క్యాంపు వెళుతున్నా రన్నయ్యా ఈయన. అందుకని మమ్మల్ని ఇక్కడ వదిలేస్తా నన్నారు."

"మంచి పని చేశాడు" అంటూ ముఖానికి అంటి ఉన్న సబ్బు నురుగ తుడి చేసుకున్నాడు రామనాథం.

రమణ వెంటనే వెళ్ళిపోయాడు.

"ఏవమ్మా... ఏమంటున్నాడు మీ ఆయన?"

"ఆయన్ని డాక్టరుకు చూపించటం చాలా మంచి దయిం దన్నయ్యా. అక్కడ ఏం ట్రీట్‌మెంట్ ఇచ్చారో గానీ. ఆయన చాలా మారిపోయారు. కోపం ఎక్కువ వచ్చినప్పుడల్లా నిశ్శబ్దంగా అయిపోతారు. కొంచెం సేపు తనలో తనే ఏమో ఆలోచిస్తూ ఉండిపోతారు. అప్పుడు చూస్తే ఎందుకో కాస్త భయపడుతున్నట్టుంటా రన్నయ్యా! తరవాత మామూలే. అంతా మర్చిపోయి మామూలు మనిషి అయిపోతారు."

"ఇడ్లీలు ఇప్పుడే వండాను. వేడిగా బాగుంటయి. రా. చిత్రా. తిందువు గాని" అంటూ చిత్రను. బాబును లోపలికి తీసుకెళ్ళిపోయింది రుక్మిణి.

రామనాథానికి వారం రోజుల కిందట జరిగిన విషయం గుర్తొచ్చింది. ఒక స్నేహితుడి సలహా వల్ల. రమణను న్యూరో సైకియాట్రీ అండ్ మెంటల్ కేర్ సెంటర్‌కి తీసుకెళ్ళాడు తను. తన ఊహలకు విరుద్ధంగా రమణ అందుకు సులభంగా అంగీకరించాడు. ఇలాంటి కేసుల్లో మంచి పేరున్న డా. పద్మనాభంతో అపాయింటుమెంటు ఫిక్స్ చేసుకుని వెళ్ళారు.

డాక్టరుగారు నలభయి నిమిషాలపాటు రమణతో గడిపిన తరవాత రామనాథాన్ని వేరుగా పిలిచి మాట్లాడారు. ఈ హాస్పిటలుకు వెళ్ళమని సలహా ఇచ్చిన స్నేహితుడికి తోడల్లుడు డా. పద్మనాభం. ఆ పరిచయం వల్లనే ఆయనను కలిసే అవకాశం రామనాథంకు సులభంగా దొరికింది.

"చూడండి. మీ బావమరిదిలో ఏ లోపమూ లేదు. మానసికంగా. దైహికంగాకూడా సంపూర్ణ ఆరోగ్యం అతని కున్నది. ఆవేశాన్ని నిగ్రహించుకో లేక పోవడమనేది ఇతని బలహీనత లాగా కనిపించినా. ఆ బలహీనతను పోగొట్టుకోవాలని అతను గట్టిగా నిర్ణయించుకుంటే చాలు మామూలుగా ప్రయత్నించాడు. చిన్నతనంలో తన తల్లిని తండ్రి కొట్టటం చాలా సార్లు చూశాడట. చూడబోతే ఆ సంఘటనలు మనసులో నాటుకుపోయి. భర్తంటే భార్యను ఇలాగే కంట్రోల్ చెయ్యాలి అన్న భావం ఒకటి ఏర్పడి నట్టుంది. చదువు. సంస్కారం ఆ భావం తప్పు అని అతని మనసుకు తెలియజెప్తున్నా. ఆవేశం వచ్చినప్పుడు అంతరాత్మశక్తి బలహీనమయి. ఇలా ప్రవర్తిస్తా డన్న మాట."

"అయితే. అతని కేం ట్రీట్‌మెంట్ అవసరం లేదంటారా?"

"ఎందుకు లేదూ? ఒక చిన్న షాక్ ట్రీట్‌మెంటుకు పంపించాను. అయిదు నిమిషాల్లో వస్తుంది. మీరు వెళ్ళొచ్చు. మీ రేం వర్రీ అవ్వద్దు. అతను కుదురుకుంటాడు."

సంఘటన అంతా గుర్తొచ్చింది రామనాథానికి. ఫలితం కళ్ళ ముందే కనిపించాక. అసలు డాక్టరుగారు రమణ కిచ్చిన ట్రీటుమెంటు ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది అతనికి. ఆఫీసుకు వెళ్ళిన తరవాత డాక్టరుగారికి ఫోను చేశాడు.

"హలో. రామనాథంగారా! బాగున్నారా?"

"థాంక్ యు. సర్. బాగున్నాను. మా బావమరిది కుదురుకున్నట్టే. మీ రేం అనుకోనంటే. మీరు మరీ బిజీగా లేకపోతే ఒక్క ప్రశ్న అడుగుతాను."

"ఫరవాలేదు. ప్రశ్న ఒక్కటే అయితే ఫరవాలేదు. చెప్పగలను."

"ఇంత త్వరగా మా రమణలో మార్పు రావటం మాకు ఆనందంగా. ఆశ్చర్యంగా ఉంది. డాక్టరుగారూ! ఆ రోజు మీరు అతన్లో ఏ లోపం లేదని చెప్పారే. ఏదో ట్రీట్‌మెంట్ ఇప్పించారు. అదేమిటో నేను తెలుసుకోవచ్చా? నేరుగా అడగటం తప్పయితే మొహమాటం లేకుండా ఫోన్ పెట్టెయ్యండి."

డాక్టరుగారి నవ్వు వినిపించింది ముందుగా. తరవాత అన్నారు—"ఇందులో రహస్యం ఏమీ లేదు. రమణగారిని బాగా పిచ్చి ముదిరిన అయిదుగురున్న గదిలో పది నిమిషాలపాటు వదిలి పెట్టాము."

"బాబోయ్! వాళ్ళతన్ని ఏమీ చెయ్యకుండా ఎలా వదిలి పెట్టారు?"

"పిచ్చిలో చాలా రకాలు. రామనాథంగారూ! అందరూ కనిపించిన వాళ్ళనల్లా కొట్టరు. రకరకాల వాళ్ళు ఉంటారు. నేను చెప్పిన అయిదుగురూ పసిబిడ్డలంత నిరపాయకరమయిన వాళ్ళు. వారి లోకంలో వారుంటారు. వారి స్థితీ. ప్రవర్తనా కూడా చిన్న పిల్లల మాదిరిగానే ఉంటుంది."

"అంటే...?"

"మేం ఎంత ప్రవర్తించినా. వాళ్ళ ఒంటి మీదకి బట్టలు చేర్చటం వల్ల కాకుండా ఉంది. ఏవి తగిలించినా. నిమిషాల్లో చించి దానికి దారంగా ఊడలాగి పోగు చేసేస్తారు. ఆ పది నిమిషాలు వాళ్ళను కళ్ళారా చూడటమే మీ బావమరిదికి..."

"ఇంక చెప్పకండి. సార్! అర్థం అయింది... మీ సహాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియకుండా ఉంది..."

డాక్టరుగారికి పొగడ్తలు వినటం ఇష్టం లేదేమో. రామనాథం మాట ముగించకముందే ఫోన్ డిస్‌కనెక్ట్ అయిపోయింది.